క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



వరంగల్ చౌరస్తా: వరంగల్ రామన్నపేట బట్టల బజారులోని బాలానగర్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 1 నుంచి 6వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాలను శ్రీవారి ఉత్సవ సేవ సమితి ఆధ్వర్యంలో చేపట్టగా సేవా సమితి సభ్యులు గందె గోవింద రాజులు, రవ్వ కృష్ణమూర్తి, పాలారపు కృష్ణమూర్తి, అశోక్, లక్ష్మి, నర్సయ్య, ఆలయ ఈఓ ఎలపాటి రత్నాకర్ రెడ్డి, చైర్మన్ పరాశరం శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వయోపరిమితి పెంపుపై హర్షం



కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయోపరిమితి 60 ఏళ్ల నుంచి 65 ఏళ్లకు పెంచడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కేయూ పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ సురేష్‌లాల్, డాక్టర్ చిర్ర రాజు శనివారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కేయూ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ రమ, డాక్టర్ శాస్త్రి, డాక్టర్ రాధికారాణి, డాక్టర్ వెంకటయ్య, డాక్టర్ భారవిశర్మ, డాక్టర్ సీహెచ్.రాజ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ వెంకట్ పాల్గొన్నారు.

కేయూలో ఓఎస్‌డీ పదవిని బీసీలకే కేటాయించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఓఎస్‌డీ పదవిని బీసీలకే కేటాయించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేయూ ఇన్‌చార్జ్ ఆరెగంటి నాగరాజు డిమాండ్ చేశారు. కేయూలోని పరిపాలన భవన వద్ద శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీల్లో వీసీల నియామకాల్లో బీసీలకు అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం బాధ్యులు విష్ణు, తిరుపతి, సోమరాజు, శ్వేత, అజయ్‌సింగ్, భీమన్న, రవితేజ, రాజు, రమేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవత వార్షికోత్సవం



ఖిలా వరంగల్: వరంగల్ 42వ డివిజన్ రంగశాయిపేటలో ఉత్సవ కన్వీనర్లు కొల్లూరి యోగానంద్, గుండు పూర్ణచందర్ ఆధ్వర్యంలో గ్రామదేవత శ్రీభూలక్ష్మి, శ్రీలక్ష్మి ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో వేద పండితుడు పోలాజు భాస్కరాచార్యుల నేతృత్వంలో బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేశారు. హోమం, గణాధిపతి పూజ, పరుణాయనం, పంచామృత నవనీత సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు.

సేవ వెల్ఫేర్ సొసైటీ రక్తదానం

హన్మకొండ: సేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో హనుమకొండ హంటర్ రోడ్డులోని క్రేసన్ ట్రాస్ ఐటీ సొల్యూషన్స్ కార్యాలయంలో శనివారం రక్తదానం శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ బాధ్యులు జూపాక రత్న ప్రణయ్, అయిత ఉషాభాస్కర్ మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న క్షతగ్రాతులు, గర్భిణులు, రక్తహీనతతో బాధపడుతున్న వారి కోసం రక్తదానం చేసినట్లు తెలిపారు. శిబిరం నిర్వాహకులు, రక్తదాతలను ఎంజీఎం బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆశాదేవి అభినందించారు. క్రేసన్ ట్రాస్ ఐటీ సొల్యూషన్ నిర్వాహకులు రాము, శివప్రసాద్, అనిల్ రాజు, సందీప్, కల్యాణ్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది శ్రీదర్, మహేష్, రాజేష్ పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరం

కాజీపేట అర్బన్: హంటర్‌రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆస్పత్రి కన్సల్టెంట్, ఇంటర్వేషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రావణ్ కుమార్ తెలిపారు. ఆస్పత్రిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.3,200 విలువగల ఇన్వెస్టిగేషన్ అండ్ కన్సల్టెన్సీ ఫీజును పూర్తి ఉచితంగా ఫిబ్రవరి 28వ తేదీ వరకు అందజేస్తున్నట్లు తెలిపారు.


శిబిరాలు ఏర్పాటు చేయాలి

కాజీపేట: కార్పొరేట్ ఆస్పత్రుల నిర్వాహకులు తరచూ స్లమ్ ఏరియాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ ప్రజల ఆరోగ్యాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కోరారు. కాజీపేట 62వ డివిజన్ సోమిడి ప్రభుత్వ కమ్యూనిటీ హాల్‌లో మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురికి ఈసీజీ, టుడీ ఈకో, రక్త, మూత్ర పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ పాల్గొన్నారు.

మొక్కే కదా అని వదిలేస్తే..

- కాజీపేట వంతెనపై ఏపుగా పెరుగుతున్న పలు మొక్కలు
- పగుళ్లు తేలిన బ్రిడ్జి
- పట్టించుకోని అధికారులు

కాజీపేట: కాజీపేట రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. వాటిని మొదట్లోనే తొలగించకపోవడంతో వేళ్లు విస్తరించి బ్రిడ్జి గోడలపై పగుళ్లు ఏర్పడి పెచ్చులూడుతున్నాయి. అధికారుల పట్టింపులేనితనం వల్ల ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ఇటీవల కాలంలో చెట్లు ఎక్కువగా పెరుగుతున్నాయి. బ్రిడ్జికి ఇరువైపులా ఏపుగా పెరుగుతున్న చెట్లు బాటసారులకు దర్శనమిస్తున్నాయి. వాటిని అలాగే వదిలేస్తే కోట్లాది రూపాయలతో నిర్మించిన బ్రిడ్జి క్రమేణా శిథిలావస్థకు చేరుకుంటుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నానాటికి మొక్కలు ఇంతింతై వటుడింతై అన్నట్లుగా చెట్లు ఎదుగుతున్నా తొలగించడానికి ఎన్‌హెచ్ అధికారులు ప్రయత్నించకపోవడం విమర్శలకు తావిస్తోంది. నిత్యం ఇంజనీరింగ్ అధికారులు బ్రిడ్జిపై నుంచి రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకునేవారు లేకుండాపోయారు. ప్రమాదకరంగా ఎదుగుతున్న మొక్కలను ఎన్‌హెచ్ ఇంజనీరింగ్ అధికారులు స్పందించి వెంటనే తొలగించడానికి చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



కాజీపేట బ్రిడ్జిపై పెరుగుతున్న రావి చెట్లు

కేయూ రిజిస్ట్రార్‌కు అభినందనల వెల్లువ



శుభాకాంక్షలు తెలుపుతున్న ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, తదితరులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ వి.రాంచంద్రంకు పలువురు అభినందనలు తెలిపారు. ఆయనను కేయూ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షురాలు డాక్టర్ సుజాత, బాధ్యులు ప్రభాకర్, సంగాల ఎఫ్రిమ్‌రాజు, మంద శ్యాంసన్, విజయ రామారావు, కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల కోఆర్డినేషన్ కమిటీ బాధ్యులు డాక్టర్ సాదు రాజేష్, నాగేశ్వర్‌రావు, కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం బాధ్యుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్ శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు, అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి చంద్రన్న, జగ్గన్న తదితరులు అభినందించారు. కాకతీయ యూనివర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ రాంచంద్రం నియామకంపై పలు విద్యార్థి సంఘాల నాయకులు కేయూ గేట్‌వద్ద శనివారం సంబురాలు జరుపుకున్నారు. రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హుస్సేన్‌నాయక్, పీడీఎస్‌యూ, బీసీ, స్వేరో, ఏబీఎస్‌ఎఫ్, నాయకులు పాల్గొన్నారు.

వీల్‌చైర్ క్రికెట్ విజేత అరుణ్‌జాన్ టీం



వరంగల్ స్పోర్ట్స్: యునైటెడ్ వే హైదరాబాద్, కంట్రోల్ ఎస్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జనవరి 20, 21వ తేదీల్లో హైదరాబాద్ గచ్చిబౌలి సమీపంలోని అర్బన్‌ఫాం మైదానంలో నిర్వహించిన వీల్ చైర్ క్రికెట్ టోర్నమెంట్‌లో తెలంగాణ టీం విజేతగా నిలిచింది. రెండు రోజుల పాటు సాగిన టెస్ట్ మ్యాచ్‌లో ఫైనల్‌లో వరంగల్‌కు చెందిన టీం కెప్టెన్ అరుణ్‌జాన్ సారథ్యంలో మహారాష్ట్రపై రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ తెలంగాణ జట్టు విజయం సాధించి విజేత ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈనెల 5 నుంచి 15వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరగనున్న టీ –29 నేషనల్ మ్యాచ్‌కు ఎంపికైనట్లు కెప్టెన్ అరుణ్‌జాన్ తెలిపారు.

పురస్కార గ్రహీతకు అభినందన

ఖిలా వరంగల్: పోలీసుల సంస్మరణ –2024 దినోత్సవం సందర్భంగా ఏ సౌండ్ మైండ్ ఇన్ సౌండ్ ఇన్ సౌండ్ బాడీ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలకు చెందిన సీఎల్‌ఐ ఎస్.సత్యనారాయణ ప్రతిభ కనబరిచి నగదు పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన ప్రదానోత్సవంలో తెలంగాణ రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ చేతుల మీదుగా రూ.10వేల నగదు పురస్కారాన్ని సత్యనారాయణ అందుకున్నారు. ఈమేరకు ఆయనను పీటీసీ పరిపాలన భవనంలో పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ (ఎస్పీ), డీఎస్పీలు, అధికారులు శనివారం అభినందించారు.

పోలీస్ క్రీడాకారులకు సన్మానం

వరంగల్ స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడా పోటీలు షటిల్, బ్యాడ్మింటన్‌లో పతకాలు సాధించిన కట్ల శ్రీనివాస్, వేణును తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని ఇండోర్ స్టేడియంలో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీనివాస్, వేణు 45ప్లస్ డబుల్స్ కేటగిరీలో కాంస్య పతకం సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీబీఏ బాధ్యులు కామిద్రి పవన్, గడ్డం కేశవమూర్తి, పోరిక విజయ్‌కుమార్, కిరణ్, రాజు, వేణు, రఘోత్తమరెడ్డి, శ్రీనివాస్, పూజారి విజయ్, బాలకృష్ణ, సుధాకర్, మహేందర్‌రెడ్డి, క్రిష్ణ పాల్గొన్నారు.

రిటైర్డ్ అధికారికి సన్మానం



న్యూశాయంపేట: ఉమ్మడి వరంగల్ జిల్లాలో లేబర్ ఆఫీసర్‌గా ఉత్తమ సేవలు అందించి పదవీ విరమణ పొంది, ఉమ్రా యాత్ర చేసిన రిటైర్డ్ లేబర్ ఆఫీసర్ మహ్మద్ హబీబుద్దీన్‌ను హమ్ ఖయాల్ – ఏ –వరంగల్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి ఇక్బాల్ దర్ద్, అక్బర్ జియా, ఎస్ఎం.సయిద్, అలీమ్ దానిష్, అమీరుద్దీన్, సాబిర్ ఆలమ్, అక్తర్ హుస్సేన్, హుస్సేన్ పాషా, లతీఫ్, ఫాజిల్ బేగ్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

అమ్ముకునే చోటే మార్కెట్ నిర్మించాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్మకొండ: విక్రయదారులకు చేపలు అమ్ముకునే చోటే చేపల మార్కెట్ నిర్మించాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మికుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నిమ్మల విజేందర్ డిమాండ్ చేశారు. ఈనెల 6న జరగనున్న మత్స్యకారుల హనుమకొండ జిల్లా సదస్సు వాల్‌పోస్టర్లను హనుమకొండ రాంనగర్ కూడలిలో చేపల విక్రయ కేంద్రం వద్ద శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపల అమ్మకమే ప్రధాన జీవనాధారంగా జీవిస్తున్న మత్స్యకార మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మత్స్యకారుల జిల్లా సదస్సుకు మత్స్యకారులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం నాయకులు చిరుత శ్రీలత, పోలు పద్మ, జంగిడి రజిత, వనమాల, ముప్పారం ధనలక్ష్మి, గుండె పద్మ, సంగినేని స్వప్న, జల్లి వనమాల, జెర్ర శిరీష, మౌటం రామ, దాసరి రాజేశ్వరి, పెద్దమ్మల మంజుల, బండి స్వప్న పాల్గొన్నారు.

కోటలో పర్యాటకుల సందడి



ఖిలా వరంగల్ మధ్యకోటలోని శిల్పాల ప్రాంగణంలో పలు పాఠశాలల విద్యార్థులు

ఖిలా వరంగల్: ఖిలా వరంగల్ మధ్యకోటలో పర్యాటకులతో సందడి నెలకొంది. శిల్పకలా సౌందర్యాలను వీక్షించేందుకు పలు ప్రాంతాల నుంచి పలు పాఠశాలల విద్యార్థులు శనివారం భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా శిల్పకళా సంపద, ఖుష్మహల్, ఏకశిలగుట్ట, శృంగారపు బావిని తిలకించారు. అనంతరం టీజీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సౌండ్ అండ్ లైటింగ్ షోను చూశారు. వారికి కాకతీయుల చారిత్రక విశిష్టతను కోట గైడ్ రవియాదవ్ వివరించారు.

జూపార్కుకు తరలివచ్చిన విద్యార్థులు



నెమళ్ల ఎన్‌క్లోజర్ వద్ద ఖమ్మం జిల్లాకు చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు

న్యూశాయంపేట : వరంగల్ కాకతీయ జూపార్క్‌కు శనివారం విద్యార్థులు భారీగా తరలివచ్చారు. వీకెండ్ కావడంతో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచే కాకుండా ఖమ్మం, కరీంనగర్ జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు దాదాపు 1,700 మంది జూపార్క్‌ను సందర్శించినట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మయూరి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శారద తెలిపారు. ఒక్కరోజే జూ పార్క్‌కు రూ. లక్షా పదివేల ఆదాయం వచ్చిందని తెలిపారు. విద్యార్థులు జూ పార్క్‌లో ఆటాపాటలతో హోరెత్తించారు. వివిధ జంతువుల ఎన్‌క్లోజర్ల వద్ద ఫొటోలు దిగుతూ సందడి చేశారు. శనివారం వీకెండ్ కావడం.. ఇటీవలే పార్క్‌కు బెంగాల్ టైగర్, బైసన్,(అడవిదున్నలు) జింకలు రావడంతో జూపార్క్‌కు విద్యార్థులు పోటెత్తారు. జంతువులను చూస్తూ కేరింతలు కొడుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు.

సంక్షిప్తంగా

జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకం

కాశీబుగ్గ సెంటర్: జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఎలగందుల వైష్ణవి బంగారు పతకం సాధించిందని ప్రధానోపాధ్యాయుడు పుట్ట రమేశ్ తెలిపారు.

కృతజ్ఞతలు తెలిపిన సొసైటీ సభ్యులు

మడికొండ: కాకతీయ వీవర్స్ వెల్ఫేర్ సొసైటీ, మహాత్మాగాంధీ మహిళా గార్మెంట్స్ సొసైటీ సభ్యులు తమ సొసైటీలకు స్థలం కేటాయించినందుకు శనివారం హైదరాబాద్‌లో టీజీఐఎస్ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యమైన, మెరుగైన విద్యుత్

హన్మకొండ: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.వెంకటరమణ తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, మెయింటెనెన్స్ సమయంలో, ఇతర కారణాలతో అంతరాయం ఏర్పడినప్పుడు వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

విద్యార్థులు సామాజిక స్పృహ కలిగిఉండాలి

దేశాయిపేట: విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి ఉండాలని కేయూ ప్రొఫెసర్ సురేష్‌లాల్ సూచించారు. వరంగల్ దేశాయిపేట రోడ్డులోని ఒయాసిస్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన సోషల్ ఫెయిర్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలు, సంస్కృతులు.. సమాజాల ఏకీకరణను సులభతరం చేశాయన్నారు. ఒయాసిస్ విద్యాసంస్థల చెర్మన్ డాక్టర్ జన్ను పరంజ్యోతి మాట్లాడుతూ పలు అంశాలపై సోషల్ ఫెయిర్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

ఖిలా వరంగల్: ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం మధ్యాహ్నం వరంగల్ ఉర్సు కరీమాబాద్ బొడ్రాయి ప్రాంతంలో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం కరీమాబాద్ బొడ్రాయి ప్రాంతానికి చెందిన వంగాల రాజేందర్ (45) కూలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈక్రమంలో అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

14 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ఖిలా వరంగల్: ఓ ఇంటిలో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యం స్థావరంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి 14 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. నిందితుడు నర్సంపేటకు చెందిన ఎండీ.మహబాబ్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

గుట్కా స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

ఖిలా వరంగల్: గుట్కా ప్యాకెట్లను ఓ ఇంట్లో నిల్వ చేసి విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి రూ.14.560ల విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బాబులాల్ తెలిపారు. ఈమేరకు వరంగల్ శివనగర్ ప్రాంతానికి చెందిన కొంతం చంద్రయ్యపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

కాజీపేట: కాజీపేట ప్రధాన రహదారిపై శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొనడంతో కడిపికొండ గ్రామానికి చెందిన రిషి అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. డీజిల్ కాలనీ నుంచి కాజీపేట వైపు వెళ్తుండగా సైకిలిస్టును తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టాడు. క్షతగాత్రుడిని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించారు.

బిర్యానీ మసాలా అడిగి గొలుసు లాక్కెళ్లాడు

హసన్‌పర్తి: బిర్యానీ మసాలా కావాలంటూ కిరాణం షాపు నిర్వాహకురాలి మెడలోని నుంచి ఓ యువకుడు చైన్ లాక్కెళ్లిన సంఘటన హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాహుపేట క్రాస్ వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు హోటళ్లకు జరిమానా

వరంగల్ అర్బన్: అపరిశుభ్ర పరిస్థితుల్లో హోటళ్లు నిర్వహిస్తున్న నిర్వాహకులకు రూ.60 వేల జరిమానా విధించినట్లు బల్దియా ముఖ్య ఆరోగ్యాధికారి డాక్టర్ రాజారెడ్డి తెలిపారు. కేయూసీ రెండో గేట్ సమీపంలో కనకయ్య హోటల్‌కు రూ.50 వేలు, మరో హోటల్‌కు రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

హసన్‌పర్తి: విద్యుదాఘాతంతో ఓ గేదె మృతి చెందిన సంఘటన హసన్‌పర్తి మండలం అర్వపల్లిలో శనివారం చోటు చేసుకుంది. అర్వపల్లికి చెందిన శ్రీపాల్‌కు చెందిన పాడి గేదె.. సమీపంలోని వాగులోకి నీళ్లు తాగడానికి వెళ్లి శనివారం విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని బాధితుడు వాపోయాడు.

వైభవంగా భక్త మార్కండేయ జయంతి

భక్త మార్కండేయ స్వామి జయంతి వేడుకలను నగర వ్యాప్తంగా శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ మేరకు మార్కండేయుడి చిత్రపటాలకు పూలమాలలు వేసి పద్మశాలి సంఘాల నాయకులు పూజలు చేశారు. ఈ సందర్భంగా పండ్లు పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



హసన్‌పర్తి: భక్త మార్కండేయుడికి పూజలు చేస్తున్న మేయర్ దంపతులు, తదితరులు



వరంగల్: కాశీబుగ్గలో భక్త మార్కండేయ జయంతిలో పద్మశాలి సంఘాల నాయకులు



దేశాయిపేట: పోచమ్మమైదాన్ జంక్షన్‌లో పండ్లు పంపిణీ చేస్తున్న రవీందర్, తదితరులు



మడికొండ: మార్కండేయుడికి పూలమాల వేసి పూజలు చేస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు



ఖిలా వరంగల్: పిల్లలకు పండ్లు పంపిణీ చేస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

తెలంగాణకు ఘనమైన చరిత్ర

- పింగిళి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి



అరవింద్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

విద్యారణ్యపురి: ఆదిమ మానవుని నుంచి ఆధునిక మానవుడి వరకు తెలంగాణకు ఘన చరిత్ర ఉందని హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తిని చంద్రమౌళి అన్నారు. కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో అన్‌టోల్డ్ తెలంగాణ అనే అంశంపై శనివారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొనగా, చరిత్రకారుడు అరవింద్ ఆర్య కీలకోపన్యాసం చేశారు. తెలంగాణ చరిత్ర ఎంతో ప్రాచీనమైందని వివరించారు. పుస్తకం రూపంలోకి రాని తెలంగాణ చరిత్ర ఇంకా ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో విభాగం అధిపతి డాక్టర్ కొలిపాక శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సురేష్‌బాబు, అధ్యాపకులు పద్మ, నరేష్‌బాబు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు రూ.10 వేలు ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న హమాలీలు

హన్మకొండ: భవన నిర్మాణ కార్మికుల మాదిరిగానే హమాలీ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి 50ఏళ్లు పైబడిన వారికి రూ.10 వేల పింఛన్ అందించాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు సీఐటీయూ ఆధ్వర్యంలో హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియం నుంచి కలెక్టరేట్ వరకు శనివారం ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కారు ఉపేందర్, ఆలకుంట యాకయ్య, హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సంగాల మొగిలి, నాయకులు విజేందర్, ఆదాం తిరుపతి, స్వామి, కుమారస్వామి, సాంబయ్య పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యావిధానంతో నష్టం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

విద్యారణ్యపురి: నూతన జాతీయ విద్యావిధానం.. రాజ్యాంగ స్ఫూర్తికి ప్రమాదకరమని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కెళ్లపెల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో హనుమకొండలోని సమాఖ్య కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో ఈనెల 9, 10వ తేదీల్లో జరగనున్న ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాల కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి ప్రణీత్, భాషబోయిన సంతోష్, బాధ్యులు వేల్పుల చరణ్, కుమార్, జక్కుల భాను, కసరబోయిన రవితేజ, జిల్లా సమితి బాధ్యులు వినయ్, పవన్, లవన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతిపై సోనియా వ్యాఖ్యలు సరికాదు



నిరసన తెలుపుతున్న నాయకులు

హన్మకొండ: రాష్ట్రపతి ద్రౌపదిముర్ముపై కాంగ్రెస్ అగ్ర నాయకురాలు చేసిన వ్యాఖ్యలు ఆమె దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర నాయకుడు మాలోతు నానునాయక్ ఆరోపించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై సోనియా వ్యాఖ్యలను ఖండిస్తూ హనుమకొండలోని తెలంగాణ అమరవీరుల స్తూపం కూడలిలో ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో సోనియా గాంధీ దిష్టిబొమ్మను శనివారం చేస్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతి, నాయకులు గణేష్, లావుడియా రఘు, నవీన్, రవినాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలరించిన 101 డ్యూయెట్ పాటలు



నయీంనగర్: శ్రీసాయిమీరా కల్చరల్ సొసైటీ, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సింగర్ చోటు 12 గంటలపాటు 101 పాటలు పాడి నిర్విరామ కచేరీ నిర్వహించారు. బాలసుబ్రహ్మణ్యం పాడిన 101 డ్యూయెట్ పాటలను 101 మంది గాయకులతో కలిసి సింగర్ చోటు నిర్విరామంగా 12 గంటలు పాడి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాడు. ప్రొఫెసర్ తిరుపతయ్య, టివి.అశోక్ కుమార్, కర్మకంటి పోతనాచారి, రాంమూర్తి పాల్గొన్నారు.

ఈజీజీ కార్ట్స్ పంపిణీ

వరంగల్: ఓ సిటీలోని ఎన్‌ఈసీసీ వరంగల్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు క్యాంపు కార్యాలయంలో 20 మందికి ఈజీజీ కార్ట్స్ కిట్లను శనివారం పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి వినీత్ రావు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.